క్లుప్తంగా

సీనియర్ విద్యార్థులు మార్గదర్శకులుగా ఉండాలి



పెనమలూరు: జూనియర్ విద్యార్థులకు సీనియర్ విద్యార్థులు మార్గదర్శకులుగా నిలవాలని ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీ చైర్మన్, పారిశ్రామికవేత్త ధనేకుల రవీంద్రనాథ్‌ఠాగూర్ అన్నారు. గంగూరు ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీలో గురువారం ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న రవీంద్రనాథ్ ఠాగూర్ మాట్లాడుతూ సీనియర్ విద్యార్థులు సహ విద్యార్థులకు మార్గదర్శకులుగా ఉండి సహకరించాలన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కడియాల రవి మాట్లాడుతూ.. విద్యార్థులందరూ మమేకమై సాంకేతిక, సాంస్కృతిక అంశాల్లో నైపుణ్యం సాధించాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో డైరెక్టర్ రవిప్రసాద్, సెక్రటరీ భవానీ ప్రసాద్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని వినతి



హనుమాన్‌జంక్షన్ రూరల్: ప్రమాదభరితంగా మారిన పాత ఇనుప విద్యుత్ స్తంభాలు, లైన్లు, రాగి వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని ఏపీ సీపీడీసీఎల్ టెక్నికల్ అండ్ కన్‌స్ట్రక్షన్ డీఈ సుధాకర్‌కు రైతులు విజ్ఞప్తి చేశారు. బాపులపాడు మండలం వేలేరులోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో 5 మెగా వాట్స్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు పనులను హనుమాన్‌జంక్షన్ ఏడీఈ బి.శ్రీనివాసరావు, వీరవల్లి ఏఈ యు.మురళీకృష్ణతో కలిసి గురువారం ఆయన పరిశీలించారు. అనంతరం గ్రామానికి చెందిన రైతులతో విద్యుత్ అధికారులు సమావేశమయ్యారు. పలు విద్యుత్ సమస్యలను రైతాంగ సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి వేములపల్లి శ్రీనివాసరావు నేతృత్వంలో డీఈ సుధాకర్‌కు వివరించారు. సమస్యలను విద్యుత్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి, సత్వర పరిష్కారానికి చొరవ చూపుతానని డీఈ సుధాకర్ చెప్పారు.

యువతి అదృశ్యంపై ఫిర్యాదు

పెనమలూరు: యనమలకుదురులో యువతి అదృశ్యమైన ఘటనపై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం యనమలకుదురు డొంక రోడ్డుకు చెందిన అబ్దుల్ నసీమున్నీసా కుటుంబ సభ్యులతో నివాసం ఉంటుంది. ఆమె సోదరి అబ్దుల్ తస్లీమున్నీసా(26) పటమటలోని ఓ ప్రైవేటు సంస్థలో గత వారం రోజులుగా పని చేస్తుంది. కాగా బుధవారం ఉదయం డ్యూటీకి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. ఆమె ఫోన్ స్విచ్ ఆఫ్ రావటంతో ఆమె కోసం కుటుంబ సభ్యులు పలు ప్రాంతాల్లో వెతికారు. అయినా ఫలితం లేకపోవడంతో అబ్దుల్ నసీమున్నీసా పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసు నమోదు చేశారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



పెనమలూరు: పెనమలూరు పేరంటాళ్ల చెరువు కట్టపై ఉన్న నివాసితులు ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా చెరువు ముంపునకు గురై నష్టపోవటంతో వారికి తహసీల్దార్ గోపాలకృష్ణ నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో నెస్లే, జేసీఐ ఇండియా సహకారంతో 100 మంది బాధితులకు బియ్యం 10 కేజీలు, కందిపప్పు, నూనె, పంచదార ఇతర నిత్యావసర సరుకుల కిట్లను బాధితులకు అందజేశారు. కార్యక్రమంలో నెస్లే ఇండియా అధికారి వసీంఅహ్మద్, నాయకులు మారుపూడి ధనకోటేశ్వరరావు, కోయా ఆనంద్, కిలారు శ్రీనివాసరావు, షేక్ శ్రీను, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఆహ్లాదం..ఆనందం

- వాకర్స్ కృషితో మారిన క్రీడా ప్రాంగణం రూపురేఖలు
- లక్షలాది రూపాయలతో వసతుల కల్పన
- హర్షం వ్యక్తం చేస్తున్న క్రీడాకారులు, ప్రజానీకం



గ్రౌండ్‌లో వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

గన్నవరం: ఒకప్పుడు పిచ్చి మొక్కలు, పందుల సంచారంతో అపరిశుభ్రంగా, రాత్రి వేళలో మందుబాబులకు అడ్డాగా ఉండే గన్నవరంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణం కొత్త రూపును సంతరించుకుంది. వాకర్స్ సమష్టి కృషితో పాటు ప్రభుత్వ ప్రోత్సాహం ఫలితంగా వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్, ఎల్ఈడీ లైటింగ్ వ్యవస్థ, క్రీడా పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. దీంతో క్రీడా ప్రాంగణం వాకర్స్, క్రీడాకారులకు నిలయంగా మారింది. ఆరోగ్యకరమైన వాతావరణంలో వాకింగ్ చేసేందుకు ప్రతి రోజు వందలాది మంది క్రీడా ప్రాంగణానికి వస్తున్నారు. అంతే కాకుండా క్రీడలు ఆడేందుకు విద్యార్థులు, యువతతో పాటు పిల్లలతో ఆహ్లాదంగా గడిపేందుకు కుటుంబాలు సైతం తరలివస్తున్నారు. ఫలితంగా గతంలో కళావిహీనంగా ఉన్న క్రీడా ప్రాంగణం పూర్వ వైభవం సంతరించుకోవడంతో పాటు ప్రజలకు ఆరోగ్యాన్ని, ఆనందాన్ని పంచుతుంది.

వాకింగ్ ట్రాక్‌తో శ్రీకారం..

నియోజకవర్గ ప్రధాన కేంద్రంలో ఉన్న ఈ క్రీడా మైదానానికి ఘన చరిత్ర ఉంది. గతంలో ఇక్కడ జాతీయ, రాష్ట్ర స్థాయిలో ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ పోటీలు కూడా జరిగాయి. ఎంతో మంది ఈ ప్రాంత క్రీడాకారులు జాతీయ స్థాయిలో గుర్తింపు సాధించారు. క్రీడలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం 2008లో ఈ గ్రౌండ్‌లో గ్యాలరీ నిర్మాణం చేసింది. అనంతరం నిర్వహణా లోపం కారణంగా క్రీడా ప్రాంగణం నిరుపయోగంగా మారింది. ఈ పరిస్థితుల్లో క్రీడా మైదానం అభివృద్ధికి మూడేళ్ల క్రితం వాకర్స్ అసోసియేషన్ నడుం బిగించింది. పిచ్చి మొక్కలతో నిండిపోయిన గ్రౌండ్‌ను శుభ్రం చేశారు. వాకర్స్, దాతల సహకారంతో లక్షలాది రూపాయలు వెచ్చించి వాకింగ్ ట్రాక్ నిర్మాణం చేశారు. జిల్లా పరిషత్ నిధులతో వాకింగ్ ట్రాక్ చుట్టూ ఎల్ఈడీ లైట్లను ఏర్పాటు చేశారు.

సరికొత్త హంగులు..

ఆరు నెలల క్రితం వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన కేవీఆర్ కిశోర్ నేతృత్వంలోని నూతన కార్యవర్గం క్రీడా ప్రాంగణం రూపురేఖలను మార్చింది. గ్యాలరీ కింద ఏర్పాటు చేసిన అసోసియేషన్ కార్యాలయాన్ని ఆధునీకరించడంతో పాటు పక్కనే ఉన్న గంగానమ్మ దిమ్మను, వాకర్స్ కూర్చునేందుకు వీలుగా బెడ్ టైల్స్‌తో నిర్మాణం చేశారు. ఎంపీ నిధులతో గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌కు సుమారు రూ. 5.50 లక్షలు వెచ్చించి బెడ్ కాంక్రీట్, టైల్స్, విద్యుత్ దీపాలు, పెయింటింగ్స్, చుట్టూ రక్షణగా ఐరన్ మెష్‌ను ఏర్పాటు చేశారు. గోడలకు వైట్ వాష్, గేట్లు, ఆట వస్తువులకు పెయింటింగ్స్ వేయించడంతో పాటు పచ్చదనాన్ని పెంపొందించేందుకు మొక్కలు నాటారు.



గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్

క్రీడాకారులను ప్రోత్సహించేందుకు వాలీబాల్, షటిల్ కోర్టులను ఏర్పాటు చేశారు. ప్రత్యేకంగా వాలీబాల్ క్లబ్‌ను ఏర్పాటు చేసి ఉచిత శిక్షణ ఇస్తూ ఔత్సాహికులైన క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నారు. ప్రతి నెల క్రీడా ప్రాంగణం నిర్వహణ, పిచ్చిమొక్కలు నిర్మూలనకు మందులు చల్లిస్తూ వేలాది రూపాయలు వెచ్చిస్తున్నారు. ఇప్పటి వరకు గ్రౌండ్‌లో సదుపాయాల కల్పన, నిర్వహణ నిమిత్తం నూతన కార్యవర్గం రూ.9 లక్షల వరకు ఖర్చు చేసింది. అందులో వాకర్స్ సభ్యులు విరాళాలు రూపంలో రూ.2.75 లక్షలు ఖర్చు చేయగా, అధ్యక్షుడు కేవీఆర్ కిశోర్ రూ.6.25 లక్షలు సొంత నిధులను వినియోగించారు. ఆరోగ్యవంతమైన సమాజం, క్రీడల అభివృద్ధికి వాకర్స్ అసోసియేషన్ చేస్తున్న కృషిని పలువురు ప్రశంసిస్తున్నారు.

సమష్టి కృషితో అభివృద్ధి..



వాకర్స్ అందరి సమష్టి కృషితో క్రీడా ప్రాంగణం అభివృద్ధి సాధ్యమైంది. గ్రౌండ్‌కు వాకింగ్, ఆడుకునేందుకు వచ్చే వారికి మెరుగైన వసతులు కల్పించాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నాం. అందుకే ఖర్చుకు ఏ మాత్రం వెనుకాడకుండా ఆధునికరించాం. ఎంపీ నిధులతో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను ప్రజలందరూ ఉపయోగించుకునే విధంగా సదుపాయలను కల్పించాం. వాకర్స్ అందరి సమన్వయంతో భవిష్యత్‌లో మరిన్ని మంచి కార్యక్రమాలను చేపడతాం.

– కేవీఆర్ కిశోర్, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు

సద్వినియోగం చేసుకోవాలి..



క్రీడా ప్రాంగణం అభివృద్ధికి వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం చేస్తున్న కృషి అభినందనీయం. గతంతో పోల్చితే వాకింగ్, వ్యాయామం, ఆటలు ఆడుకునేందుకు పెద్ద సంఖ్యలో జనం గ్రౌండ్‌కు వస్తున్నారు. ప్రజలందరి మేలు కోసం వాకర్స్ అసోసియేషన్ ద్వారా క్రీడా ప్రాంగణంలో వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్ వంటి సదుపాయలను అందుబాటులోకి తీసుకువచ్చాం. ఆరోగ్యవంతమైన జీవనం కోసం ప్రజలందరూ వీటిని సద్వినియోగం చేసుకోవాలి.

– తిరివీధి వెంకయ్య, న్యాయవాది

సమర్థంగా ఉపాధి కల్పన జరగాలి



కంకిపాడు: ఉపాధి కల్పన సమర్థంగా, పారదర్శకంగా జరగాలని డ్వామా పీడీ ఎన్‌వీ శివప్రసాద్ యాదవ్ ఆదేశించారు. కంకిపాడు మండల పరిషత్ కార్యాలయంలో సామాజిక తనిఖీ ప్రజా వేదిక కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఏప్రిల్ 1, 2023 నుంచి మార్చి 31, 2024 వరకూ మండలంలోని వివిధ గ్రామాల్లో నిర్వహించిన రూ.8.85 కోట్ల ఉపాధి పనులకు సంబంధించి సామాజిక తనిఖీ నిర్వహించారు. గ్రామాల వారీగా ఉపాధి పనులకు సంబంధించి నివేదిక సమర్పించగా అధికారులు సమీక్ష జరిపారు. 1,194 పనులకు సంబంధించి ఉపాధి పనుల నాణ్యతపై వివరాలు సేకరించారు. డ్వామా పీడీ మాట్లాడుతూ ఉపాధి నిధులు సద్వినియోగం అయ్యేలా చూడాలన్నారు. జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపాధి చూపాలన్నారు. పనుల నిర్వహణ సమర్థంగా సాగాలని, లోపాలకు అవకాశం లేకుండా చూడాలని సూచించారు. ఏపీడీ ఎన్‌వీ నాంచారరావు, ఎంపీడీఓ పి.అనూష, అంబుడ్స్‌మెన్ కేవీ శ్రీనివాసరావు, డీవీఓ సురేష్, ఏపీఓ పాల్‌రాజు పాల్గొన్నారు.

రతన్ టాటా మృతికి సంతాపం

గన్నవరం: పారిశ్రామిక దిగ్గజం రతన్ టాటా మృతికి ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు సంతాపం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. నీతి, నిజాయతీ, నైతిక విలువలతో రతన్ టాటా ఒక పెద్ద వ్యాపార సామ్రాజ్యాన్ని సృష్టించారని పేర్కొన్నారు. దాతృత్వంతో పాటు కార్పొరేట్ సేవల ద్వారా దేశంలోని సామాన్య, మధ్య తరగతి ప్రజల అవసరాలు, ఆకాంక్షలను నెరవేర్చిన గొప్ప వ్యక్తిగా కొనియాడారు. ఆయన మరణం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.

దుర్గాదేవీ ప్రణామం

గన్నవరం, పెనమలూరు నియోజకవర్గాల్లో శ్రీదేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజైన గురువారం అమ్మవార్లు శ్రీదుర్గాదేవీగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అర్చనలు, హోమాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారు.

– కంకిపాడు, పెనమలూరు, ఉయ్యూరు, రామవరప్పాడు, ఉంగుటూరు, విజయవాడరూరల్



దుర్గాదేవిగా కాశీ అన్నపూర్ణాదేవి



మహాలక్ష్మిదేవిగా వాసవీ అమ్మవారు



విజయదుర్గాభవానీదేవి ఆలయంలో



యనమలకుదురులో దుర్గాదేవి



దుర్గాదేవిగా పేరంటాలమ్మవారు



ఆత్కూరులో దుర్గాదేవిగా



దుర్గాదేవిగా శ్రీకామాక్షిదేవి



ప్రొద్దుటూరు గాయత్రీ విహార్‌లో..



కంకిపాడు శివాలయంలో..



దుర్గాదేవిగా జగదాంబ దేవీ



మహాగౌరీదేవిగా పార్వతీదేవి



పోరంకి సాయిబాబా మందిరంలో..

ముస్తాబాదలో రైతుల ఆందోళన



ముస్తాబాదలో ఆందోళన చేస్తున్న రైతులు

గన్నవరంరూరల్: మండలంలోని ముస్తాబాద రైతులు గురువారం ఆందోళన నిర్వహించారు. రైల్వే లైన్‌కు గ్రావెల్ తోలుతున్న లారీలను అడ్డుకున్నారు. ముస్తాబాద రైల్వే లైన్ వెంట కొత్తగా నిర్మిస్తున్న ఆర్ఓబీ(రైల్వే ఓవర్ బ్రిడ్జి) వెంట గ్రామానికి చెందిన రైతాంగం పొలం సుమారుగా 1,500 ఎకరాలు ఆయకట్టు ఉంది. ఈ ఆయకట్టు ఇటీవల వర్షాలకు ముంపునకు గురైంది. 2020లో రైల్వే అధికారులు ఈ ప్రాంతంలో ఆర్ఓబి నిర్మించాలని 35 ఎకరాలు భూమిని రైతుల వద్ద తీసుకున్నారు. అయితే అప్పట్లో రైతులకు నష్టం లేకుండా నిర్మాణం ఉంటుందని పలు హామీలు ఇచ్చారని రైతులు చెప్పారు. కాగా ప్రస్తుతం రైల్వే సేకరించిన భూమిని మొత్తం రబ్బీసుతో 30 అడుగుల మేర ఎత్తుగా నిర్మిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నిర్మాణాలతో దిగువకు వెళ్లే పరిస్థితి ఉండదన్నారు. ఎన్నిసార్లు అధికారులకు తెలిపినా పట్టించుకున్న దాఖలాలు లేవని, వారి పనులు చేసుకుంటూ పోతున్నారన్నారు. రైతుల ప్రయోజనాలు కాపాడేందుకు అధికారులు జోక్యం చేసుకుని మురుగు నీరు, అధిక నీరు వెళ్లేందుకు పంట బోదె, దాంతో పాటు సర్వీస్ రోడ్డు నిర్మించాలని కోరుతున్నారు. అప్పటి వరకూ పనులు నిలిపివేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఆందోళనలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు పాలడుగు మల్లికార్జునరావు, రైతులు పాలడుగు రత్నారావు, హుస్సేన్, సాంబశివరావు, నాగేశ్వరరావు, పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

నున్న(విజయవాడరూరల్): ప్రాంతీయ అయుర్వేద పరిశోధన సంస్థ, న్యూ రాజీవ్‌నగర్, పాయకాపురం ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పరిశోధన అధికారి డాక్టర్ ఏజేవీ సాయిప్రసాద్ తెలిపారు. నున్న గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం జరిగిన ఉచిత వైద్యశిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆయుర్వేద మొబైల్ హెల్త్ కేర్ షెడ్యూల్డ్ కులాల ప్రణాళికలో భాగంగా ప్రతి సోమ, గురువారాల్లో ఉచిత వైద్యశిబిరం జరుగుతుందన్నారు. చెడు కొలెస్ట్రాల్ పెరగకుండా తెలుసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అయుర్వేద వైద్యం ఆరోగ్యానికి మంచి ఫలితాలను ఇస్తుందని చెప్పారు. శిబిరంలో సంస్థ సిబ్బంది పాల్గొన్నారు. ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలన్నారు.

వాంబేకాలనీలో మెగా వైద్యశిబిరం

పాయకాపురం(విజయవాడరూరల్): ప్రజలు ఆరోగ్యంగా ఉండాలనే ఆలోచనతో వరద ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేస్తున్నట్లు క్రాస్ గాస్పెల్ మినిస్ట్రీస్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పాస్టర్ ఎ.రమేష్ పాల్ తెలిపారు. వాంబేకాలనీలో ఉచిత మెగా మెడికల్ క్యాంప్‌ను గురువారం నిర్వహించారు. ఇప్పటి వరకు 15 ప్రాంతాల్లో వైద్య నిపుణులతో మెగా మెడికల్ క్యాంపులు నిర్వహించి ఉచితంగా వైద్య సేవలందించామన్నారు. వాంబేకాలనీ, పాయకాపురం, శాంతినగర్‌కు చెందిన వెయ్యి మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందించారు. చారిటబుల్ ట్రస్ట్ డైరెక్టర్ కాదీష్‌బాబు, డాక్టర్లు సూరెడ్డి అరవింద్, ఈ.ఝాన్సీలక్ష్మి, డి.వరుణ్, వి.విజయ్ కుమార్, డి.తరుణ్ శివకుమార్, పాస్టర్ పి.ప్రభుభూషణ్, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిప్రపత్తులతో బతుకమ్మ పండుగ



కంకిపాడు: బతుకమ్మ పండుగను భక్తులు భక్తిప్రపత్తులతో జరుపుకున్నారు. దుర్గా నవరాత్రులను పురస్కరించుకుని గురువారం రాత్రి గోసాల సెంటరులో గౌడ సంఘం ఆధ్వర్యంలో బతుకమ్మ పండుగ వైభవంగా నిర్వహించారు. మహిళలు బతుకమ్మలను అలంకరించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామాల్లో మహిళలు గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమాన్ని గౌడ సంఘం ప్రతినిధులు చెవిగోని భిక్షం, నకరికంటి శేఖర్, డెంకల వెంకన్న, మాదు అరుణ్‌కుమార్ పర్యవేక్షించారు.

వైభవంగా అయ్యప్ప పడిపూజ



కంకిపాడు: అయ్యప్ప పడి పూజా మహోత్సవం వైభవంగా జరిగింది. మండలంలోని ఈడుపుగల్లు గ్రామంలో అయ్యప్ప మాలధారి పర్వతనేని రవి 18వ పడి సందర్భంగా గ్రామంలో బుధవారం రాత్రి పడిపూజ నిర్వహించారు. స్వర్ణకంకణ గ్రహీత కోసూరు శ్రీనివాసరావు, ఉప్పలూరు రాజా గురుస్వామి నేతృత్వంలో పడి పూజ, భక్తి గీతాలాపన జరిపించారు. మాలధారి పర్వతనేని రవి, శ్రీదుర్గ దంపతులు స్వామి వారికి విశేష పూజలు జరిపించారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో అయ్యప్ప, భవానీ, శివ మాలధారులు పాల్గొన్నారు.

కానూరులో రేషన్ బియ్యం పట్టివేత

పెనమలూరు: అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం కానూరు తులసీనగర్ పవర్‌మాల్ వద్ద ఇంట్లో రేషన్ బియ్యం డంప్ ఉందన్న సమాచారంతో పోలీసులు బుధవారం రాత్రి దాడి చేశారు. అక్రమంగా నిల్వ ఉంచిన 15 బస్తాల రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సనత్‌నగర్ రేషన్ డిపోకు చెందిన ఎండీయూ వాహన డ్రైవర్ షేక్.మునాఫ్ రేషన్ లబ్ధిదారుల వద్ద తక్కువ ధరకు బియ్యం సేకరించి సనత్‌నగర్ డీలర్ సుధాకర్‌కు విక్రయిస్తున్నట్లు గుర్తించామన్నారు. నిందితులపై కేసు నమోదు చేశామని చెప్పారు. ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించి రేషన్ బియ్యం నిల్వ ఉంచినా, రవాణా చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని రెవెన్యూ అధికారులు హెచ్చరించారు.

ముగిసిన శిక్షణ తరగతులు

విజయవాడరూరల్: గ్రామ పంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే ఆదాయ వనరులు వాటిని గ్రామాల్లో అభివృద్ధి పనులకు వినియోగించే విషయాలపై అవగాహన కలిగి ఉండాలని ఈఓఆర్డీ ఎండీవీ ప్రసాద్ తెలిపారు. విజయవాడ రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో ఉప సర్పంచ్‌లకు, పాలకవర్గ సభ్యులకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ నిధులతో పాటు ఇతర శాఖల నుంచి వచ్చే గ్రాంట్లు, వాటి వివరాలను తెలుసుకొని ప్రణాళిక ప్రకారం వినియోగించాలన్నారు. గ్రామాల అభివృద్ధికి సమన్వయంతో కృషి చేయాలని చెప్పారు. అదే విధంగా గ్రామాల్లో జరిగే పారిశుద్ధ్య కార్యక్రమాలు, వీధి దీపాల నిర్వహణ, తాగునీటి సరఫరా తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

రైతుబజారులో సబ్సిడీపై నూనెల విక్రయాలు

పాయకాపురం(విజయవాడరూరల్): పాయకాపురం రైతుబజారులో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌లో వంట నూనెల విక్రయాలను గురువారం ఏఎస్ఓ-3 ఎస్.లక్ష్మణ్‌బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన, జాయింట్ కలెక్టర్ డాక్టర్ నిధి మీన ఆదేశాల మేరకు పాయకాపురం రైతుబజారులో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసి వినియోగదారులకు ఆయిల్ విక్రయాలు నిర్వహిస్తున్నామన్నారు. పామోలిన్ కిలో ప్యాకెట్ రూ.115, ఉల్లిపాయలు కేజీ రూ.33, టమాట కేజీ రూ.50లకు విక్రయిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆర్ఐలు శరత్‌బాబు, వెంకటకుమారి, ఎస్టేట్ ఆఫీసర్ కిరణ్ పాల్గొన్నారు.